క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు

షాద్‌నగర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మనో వికాసం కలుగుతుందని నైస్ ఫౌండేషన్ నిర్వాహకుడు వెస్లీ అన్నారు. గురువారం మండల పరిధిలోని రాయికల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చికాగో మెడికల్ రీసర్చ్, నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ శిబిరంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఫౌండేషన్ నిర్వాహకులు వెస్లీ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రతి రోజు యోగా సాధన చేయాలన్నారు. చిన్నప్పటి నుంచి విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని అన్నారు. పేద విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం జయమ్మ, ఫౌండేషన్ సభ్యులు వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారించాలి

తపస్ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ మనోహర్

కేశంపేట: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో పాటు ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తపస్ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వనరుల కేంద్రంలో తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎంఈఓ మనోహర్‌తో కలిసి అంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అంజన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 317 వలన నష్టపోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. పాఠశాల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల గౌరవఅధ్యక్షుడు జోసెఫ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కార్యదర్శులు రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు

చేవెళ్ల: విద్యార్థులు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని వెల్‌స్పన్ కంపెనీ డైరెక్టర్ జ్యోషి, చేవెళ్ల ఆర్డీఓ సాయిరామ్, చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో గురువారం మోడల్ స్కూల్, వెల్‌స్పన్ కంపెనీ ఆధ్వర్యంలో సైన్స్ ఫేర్, ఎడ్యుకేషన్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి మరిత నైపుణ్యాలను సాధించేందుకు సహకరించాలని కోరారు. విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు.

షాబాద్ మండలాన్ని విభజించండి

తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి



శ్రీధర్‌రెడ్డి

షాబాద్: పరిపాలనా సౌలభ్యం కోసం షాబాద్ మండలాన్ని విభజించాలని తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం షాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, దీంతో గ్రామాల అభివృద్ధి చాలా కుంటుపడుతుందన్నారు. హైతాబాద్ లేదా నాగర్‌గూడను కొత్త మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. అన్ని వనరులున్న నాగర్‌గూడను కొత్త మండలముగా ఏర్పాటు చేస్తే అందిరికీ అందుబాటులో ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం రెవెన్యూ పరిధిలోని 815 సర్వే నంబర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేసినట్లు తహసీల్దార్ అన్వర్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మురిపించి వదిలేశారు

కంకరపోశారు.. బీటీ మరిచారు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..
- అసంపూర్తిగా చిలుకూరు, మొయినాబాద్ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, గ్రామస్తులు



కంకర పోసి వదిలేసిన చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు

మొయినాబాద్: ఇరవై నెలల క్రితం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాది క్రితం పనులు మొదలు పెట్టారు. ఎన్నికల ముందు మరింత హడావుడి చేసి వంద మీటర్ల దూరం బీటీ రోడ్డు వేశారు. ఆ తరువాత పూర్తిగా వదిలేశారు. ఇదీ చిలుకూరు-మొయినాబాద్ బీటీ రోడ్డు నిర్మాణ దుస్థితి. మండల పరిధిలోని చిలుకూరు నుంచి వయా మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2022 మార్చి 13న అప్పటి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితారెడ్డి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఏడాది క్రితం కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు కంకర పోసి, బీటీ రోడ్డు వేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. కానీ మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు మాత్రం అప్పట్లో పనులు మొదలు పెట్టలేదు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది.

చిత్తశుద్ధిలేదు

చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు రోడ్డు పనులను ఎన్నికల ముందు హడావుడిగా మొదలు పెట్టారు. ఎన్నికలకు పది రోజుల ముందు నుంచి చిలుకూరు నుంచి కొంత దూరం వరకు రోడ్డుపై కంకర వేశారు. ఎన్నికలకు ఒక రోజు ముందు వంద మీటర్ల దూరం బీటీ రోడ్డు కూడా వేశారు. ఆ తరువాత రోడ్డు పనులను పూర్తిగా నిలిపేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నలభై రోజులు దాటినా కాంట్రాక్టర్ మాత్రం పనులు చేపట్టడంలేదు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బీఆర్‌ఎస్ నేతలు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ముందు పనులు చేయించారని, ఓటింగ్‌కు ఒక రోజు ముందు కొంత దూరం బీటీ రోడ్డు వేయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల తరువాత పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు చిత్తశుద్ధిలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై కంకర, మట్టి పోసి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వాపోతున్నారు.

నాణ్యతా లోపం

చిలుకూరు నుంచి సురంగల్ వరకు మొత్తం 6 కిలో మీటర్ల దూరం బీటీ రోడ్డు వేయాల్సి ఉండగా మొదటగా కాంట్రాక్టర్ సురంగల్ నుంచి పనులు మొదలు పెట్టారు. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు సుమారు 3.5 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు వేశారు. కానీ అది నాణ్యతాలోపంతో వేసిన నెల రోజులకే పెచ్చులు లేసింది. సురంగల్ పెద్దచెరువు సమీపంలో వంద మీటర్ల దూరం బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారు. ఇక చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు సుమారు 2.5 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు వేయాల్సి ఉండగా.. కిలోమీటర్‌కుపైగా దూరం మట్టి పోసి వదిలేశారు. మరో కిలోమీటర్ దూరం కంకర పోశారు. కేవలం వంద మీటర్ల దూరం మాత్ర బీటీ రోడ్డు వేశారు.

పనులు జరగడం లేదు



మొయినాబాద్ మండలం చిలుకూరు నుంచి వయా మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో పనులు జరగడం లేదు. ఎన్నికలకు ఒక రోజు ముందు హడావుడిగా వంద మీటర్ల దూరం బీటీ రోడ్డు వేశారు. ఆ తరువాత పనులే చేయడంలేదు.

–జొన్నాడ రాజు, చిలుకూరు,

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం



చిలుకూరు-సురంగల్ రోడ్డు పనులు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు చాలాసార్లు చెప్పాం. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు వేసిన బీటీ రోడ్డు నాణ్యత లేదని గుర్తించాం. అందుకే ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. మిగతా పనులు కూడా త్వరలోనే పూర్తి చేయిస్తాం.

–విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ డీఈ, మొయినాబాద్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎంపీ రంజిత్‌రెడ్డి



పూజ చేస్తున్న రంజిత్‌రెడ్డి, నాయకులు

మొయినాబాద్ రూరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి గణపతి హోమం, కుమారస్వామికి పూలు, పండ్లు సమర్పించి అయ్యప్ప స్వామికి నూతన వస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప మహాపడిపూజలో మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



గుంతలు పూడ్చుతున్న ట్రాఫిక్ పోలీసులు

శభాష్ పోలీస్

శంకర్‌పల్లి: ఆర్‌అండ్‌బీ అధికారులు చేయాల్సిన మరమ్మతు పనులను చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు చేసి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పత్తేపురం ఫ్లైఓవర్‌పై గుంతలు ఏర్పడటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోక పోవడంతో గురువారం చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు నరేశ్, రాంచందర్ స్థానికులు సహకారంతో గుంతలను పూడ్చారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు అభినందనలు తెలియజేశారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని కోరారు.

ఆదర్శప్రాయుడు వివేకానందుడు

చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ లక్ష్మారెడ్డి

చేవెళ్ల: యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శప్రాయుడని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులతో రంగోళి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఐ లక్ష్మారెడ్డి, ఏబీవీపీ శంషాబాద్ విబాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని, ఆయన ఆశయాల కోసం పనిచేయాలన్నారు. విద్యార్థుల అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందని చెప్పారు. రంగోళి కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్, నందిని, మహేశ్, హరికృష్ణ, ప్రవీణ్, కార్కీ, కిషోర్, విజయ్, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు పాఠశాల దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజియాసుల్తానా సూచించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం టీచర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు రోజంతా విద్యను అభ్యసించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రజియాసుల్తానా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో పోటీతత్వంలో పాల్గొన్నప్పుడే విజయాలను వరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, నరేందర్, యాదగిరి, బాలస్వామిరెడ్డి, నర్సింహులు, సింహాచలం, సునీల్, రాములు, సమీనా, రవికాంత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తాం
- ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి
- సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరవు



షాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రశాంతిరెడ్డి

షాబాద్: సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి సూచించారు. గురువారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 15 మంది ఎంపీటీసీలంటే ఆరుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. 41 మంది సర్పంచ్‌లకు గాను 16 మంది హాజరయ్యారు. సమావేశ మందిరంలో సగం కుర్చీలు ఖాళీగా కనిపించాయి. కొంతమంది అధికారులు వచ్చి వంతుల వారిగా ఎజెండాలు చదివి వెళ్లిపోయారు. జీపీలకు కేటాయించిన నిధులు బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలని సర్పంచ్‌లు కోరారు. గ్రామాల్లో రోడ్లు వేయాలని పీఆర్ ఏఈ శ్రీదివ్యను కోరాగా.. చర్లగూడ, నరేడ్లగూడలో రోడ్ల పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

రైతుబీమా అందడం లేదు

సకాలంలో రైతులకు రైతుబంధుతో పాటు రైతు బీమా అందడం లేదని వ్యవసాయశాఖ అధికారి వెంకటేశంను ప్రశ్నించారు. 1, 2 ఎకరాల రైతులకు డబ్బులు వేస్తున్నామని, మిగతావారికి విడతల వారీగా రైతుబంధు సాయం అకౌంట్‌లో వేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినా ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌లు కోరారు. అలాగే పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో మురుగు నీరు వస్తోందని అధికారులు వెంటనే స్పందించి నీటి ట్యాంకులను, శుభ్రం చేయాలని సర్పంచ్‌లు అధికారులకు దృష్టికి తెచ్చారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని కోరారు. ఏఈ శారద మాట్లాడుతూ లీకేజీలను పరిశీలించి సరిచేస్తామన్నారు. మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, రేగడిదోస్వాడ తదితర గ్రామాల్లో ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, గ్రామానికి దూరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ సమీపంలో ఏర్పాటు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన పటించుకోవడం లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని ఏఈ నరేందర్ తెలిపారు. ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పనులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీఓ అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, ఏఈలు దివ్య, నరేందర్, శారద, వైద్యులు వరలక్ష్మి, శ్రీనివాస్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. గురువారం బాలవికాస్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సహకారంతో రామంతపురం వార్డులో స్థానికులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 13,14వ వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, కౌన్సిలర్ శ్వేత పాండురంగారెడ్డి, చాకలి అశోక్, శ్రీనాథ్‌గౌడ్, నాయకులు బాలకృష్ణ, పాండురంగారెడ్డి, తాఫిక్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: బ్రిలియంట్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



చేవెళ్ల: సాయిచైతన్య పాఠశాలలో విద్యార్థులకు బోగిపండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు

సంక్రాంతి శోభ

షాద్‌నగర్: పాఠశాలల్లో విద్యార్థులు ముందుగానే సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలను వేడుకగా నిర్వహించారు. పిల్లలు సంప్రదాయ దుస్తులతో మురిపించారు. హరిదాసు, డూడూ బసవన్న, సంక్రాంతి లక్ష్మి వేషధారణలతో అలరించారు. పట్టణంలోని కాకతీయ, బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలల్లో రంగ వల్లుల కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి పండగ గురించి సంప్రదాయాలు, విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.



షాద్‌నగర్ రూరల్: సంక్రాంత్రి సంబరాల్లో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి

- ఏరువాక, మొక్కజొన్న కేంద్రం శాస్త్రవేత్తలు
- మీర్జాగూడ, ఇబ్రహీంపల్లి గ్రామాల్లో పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

చేవెళ్ల: సకాలంలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడి పొందవచ్చని ఏరువాక కేంద్రం తాండూరుకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మయ్య, మొక్కజొన్న పరిశోధన కేంద్రం కీటక విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వాణిశ్రీలు అన్నారు. చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ, ఇబ్రహీంపల్లి గ్రామాల్లో కూరగాయల సాగు, శనగ, కుసుమ పంటలను గురువారం చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, ఎంఏఓ తులసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగుకు సంబంధించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా.. వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి, సూచనలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీర్జాగూడ సర్పంచ్ భీమయ్య, ఆయా గ్రామాల రైతులు, వ్యవసాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

చేవెళ్ల: సంక్రాంత్రి పండుగ సందర్భంగా శనివారం చేవెళ్లలో మహిళలకు మండల మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ తెలిపారు. చేవెళ్లలో గురువారం వారు మాట్లాడుతూ చేవెళ్ల మార్కెట్ యార్డులో శనివారం ఉదయం 9 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని మహిళలు, విద్యార్థినీలు పాల్గొనాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.5,000, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000తో పాటు షీల్డ్‌లను అందించటం జరుగుతుందన్నారు. పోటీలో పాల్గొనే మహిళలు రంగులను తెచ్చుకోవాలని సూచించారు.